చేతులెత్తేసిన ఛత్తీస్‌గఢ్

ఐదేండ్లైనా హామీలను నెరవేర్చని కాంగ్రెస్ సర్కార్

జాబితాలో రుణమాఫీ, నిరుద్యోగ భృతి, ఉద్యోగ కల్పన, మద్యనిషేధం, రైతులకు పింఛన్లు, పేదలకు ఇండ్లు

ప్రజల్లో అంతకంతకూ పెరుగుతున్న వ్యతిరేకత ● ఓట్లు అడిగేందుకు ఊళ్లకు రావద్దంటూ బ్యానర్లు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 21 (నమస్తే తెలంగాణ): ఛత్తీస్‌గఢ్‌లో అధికారం చేపడుతున్న కాంగ్రెస్‌పై అక్కడి ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. 2018 ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీ సీఎం రమణ్‌సింగ్ నియోజకవర్గం రాజ్‌నంద్‌గావ్ ర్యాలీలో కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్‌గాంధీ పాల్గొన్నారు. 'జన్ గోష్నా పత్రా (ప్రజా మ్యానిఫెస్టో)' పేరిట ఎన్నికల మేనిఫెస్టోని విడుదల చేశారు. అయితే, ఐదేండ్లు గడిచినప్పటికీ, మ్యానిఫెస్టోలోని ప్రధాన హామీలను ప్రభుత్వం ఇంకా నెరవేర్చలేదు. దీంతో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలుచేయని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేని పార్టీకి మళ్లీ ఎలా ఓటేస్తామంటూ కాంగ్రెస్‌ను ప్రజలు నిలదీస్తున్నారు. ఓట్లు అడిగేందుకు రావద్దంటూ కోర్బా జిల్లాలోని రామ్‌పూర్ నియోజకవర్గంలో ఏకంగా బ్యానర్లను ఏర్పాటుచేసి తమ నిరసనను తెలియజేశారు.

నిరుద్యోగభృతి

'రాజీవ్ మిత్ర యోజన' కింద రాష్ట్రంలోని 10 లక్షల మంది నిరుద్యోగ యువతకు నెల నెలా నిరుద్యోగ భృతి ఇస్తామంటూ గద్దెనెక్కిన కాంగ్రెస్‌కు.. ఐదేండ్లయినా ఆ సోయి లేకుండాపోయింది. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో హఠాత్తుగా ఇటీవల ఈ విషయాన్ని తెరమీదకు తీసుకొచ్చింది. లబ్దిదారుల సంఖ్యను తగ్గించుకోవడానికి నిబంధనల పేరిట కొత్త కొర్రీలు పెట్టింది. కుటుంబ సంవత్సరాదాయం రెండున్నర లక్షలు దాటని యువతకు మాత్రమే ఈ భృతిని పరిమితం చేసింది. వాస్తవానికి 10 లక్షల మంది నిరుద్యోగులకు నెలకు రూ. 2,500 చొప్పున భృతి కావాలంటే సుమారు. 3 వేల కోట్లు ప్రతి ఏటా బడ్జెట్‌లో కేటాయించాలి. కొత్త నిబంధనలను తీసుకొచ్చి..బడ్జెట్‌లో 250 కోట్లు మాత్రమే కేటాయించింది. అంటే పదిలో తొమ్మిది మంది నిరుద్యోగులకు 'చెయ్యి'చ్చిందన్న మాట. భృతి విషయమై సర్వత్రా నిరసనలు వ్యక్తమవ్వడంతో మూడు విడుతల్లో 1,16,737 మందికి రెండునెలలు భృతి చెల్లించినట్టు సమాచారం.

ఉద్యోగ నోటిఫికేషన్లకూ మంగళం

అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగ నోటిఫికేషన్లను ఇస్తామని ప్రకటించిన సర్కారు ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. గత ఏడాది సెప్టెంబర్‌లో 91 ప్యూన్ పోస్టుల కోసం పరీక్షను నిర్వహించాలనుకొంటే ఏకంగా 2.25 లక్షల దరఖాస్తులు రావడం, అభ్యర్థుల్లో పీజీ, పీహెచ్‌డీ, ఇంజినీర్లు కూడా ఉండటం రాష్ట్రంలోని నిరుద్యోగ తీవ్రతకు అద్దం పడుతున్నది.

మద్యనిషేధం

అధికారంలోకి వస్తే సంపూర్ణ మద్యనిషేధం విధిస్తామని మ్యానిపెస్టోలో కాంగ్రెస్ వాగ్దానం చేసింది. ఎన్నికలకు ముందు ప్రతి సభలోనూ కాంగ్రెస్ నాయకులంతా మద్యనిషేధంపై ప్రకటనలు చేశారు. ఓ దశలో సీఎం బఘేల్ అప్పటి బీజేపీ ప్రభుత్వానికి మద్యనిషేధం అమలు చేయాలని ఆర్‌ఎస్‌ఎస్ సూచించడం లేదని ధ్వజమెత్తారు కూడా. అయితే అధికారంలోకి రాగానే.. సీఎం సహా కాంగ్రెస్ నేతలంతా ఆ విషయం ఎత్తడమే మానేశారు. ప్రభుత్వ ఆదాయం పెంపు మీదనే దృష్టి పెట్టారు. కరోనా లాక్‌డౌన్‌లోనూ మద్యం ద్వారా ఆదాయం కోసం.. ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా ఇంటింటికీ మద్యం సరఫరా పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. దానికితోడు కరోనా చార్జీ పేరుతో లిక్కర్‌పై పన్నును వేసింది.

రిక్త హస్తం



రైతు రుణమాఫీ

అధికారంలోకి వచ్చిన పది రోజుల్లోనే రైతు రుణాలన్నీ మాఫీ చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ దాన్ని నిలబెట్టుకోలేకపోయింది. చరియా దంఢ్ గ్రామంలో రుణమాఫీపై ప్రభుత్వానికి తన బలిదానం కనువిప్పు కావాలని ఓ రైతు ఆత్మహత్యను వీడియో తీయడం రాష్ట్రాన్ని అట్టుడికించింది. 35 లక్షల మంది రైతుల రుణాలన్నీ మాఫీ చేస్తామంటూ గద్దెనెక్కిన ప్రభుత్వం రైతులకు శూన్యహస్తం చూపిందంచిందని విపక్షాలు మండిపడ్డాయి. అయితే, రాష్ట్రంలోని 13.46 లక్షల మంది రైతులు సహకార బ్యాంకుల్లో తీసుకున్న రూ. 5,260 కోట్ల విలువ చేసే స్వల్పకాలిక రుణాలన్నీ చెల్లించామని సర్కారు చెప్పుకొచ్చింది. పబ్లిక్ సెక్టార్ బ్యాంకులు, రాష్ట్ర గ్రామీణ బ్యాంకులు ఇచ్చిన రుణాలను కూడా చెల్లిస్తున్నామని తెలిపింది. అయితే, అలా చేయలేదు. అంతేకాదు, పాక్షిక రుణమాఫీ అనంతరం సీఎం బఘేల్ మాట్లాడుతూ.. వచ్చే ఏడాది నుంచి రుణమాఫీ ఉండబోదని 2019లో చావుకబురు చల్లగా చెప్పారు.

మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు అసంతృప్తి సెగ

టిక్కెట్ల పంపిణీపై లొల్లి..కమల్‌నాథ్, దిగ్విజయ్ దిష్టిబొమ్మల దహనం

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 21(నమస్తే తెలంగాణ): మధ్యప్రదేశ్ కాంగ్రెస్‌లో అసెంబ్లీ టిక్కెట్ల పంపిణీ కాక రేపింది. ఆ పార్టీకి అసంతృప్తుల సెగ గట్టిగా తగులుతున్నది. తాజాగా అభ్యర్థుల రెండో జాబితా విడుదల తర్వాత ఇది తారాస్థాయికి చేరింది. టిక్కెట్ లభించని పలువురు ఆశావహులు తమ మద్దతుదారులతో కలిసి భోపాల్‌లోని పీసీసీ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. మాజీ సీఎం, కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. మరో నేత కమల్‌నాథ్ ఇంటిముందు పార్టీ కార్యకర్తలు నిరసన ప్రదర్శన నిర్వహించారు. సొంత పార్టీ నేతలే ఆయన దిష్టిబొమ్మను దహనం చేసి, కమల్‌నాథ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కమల్‌నాథ్ తన మద్దతుదారులకే టికెట్లు కేటాయించారని, ఇతర నాయకులకు అన్యాయం చేశారని టిక్కెట్ లభించని ఆశావహులు ఆరోపించారు.స్థానికులకు కాకుండా వలస నేతలకు టికెట్లిచ్చారని, వారిని వెంటనే మార్చాలని నినాదాలు చేశారు. లేకుంటే కాంగ్రెస్ అభ్యర్థులకు వ్యతిరేకంగా పనిచేసి ఓడిస్తామని హెచ్చరించారు.

ఎమ్మెల్యేగా ఒక్క పనీ చేయలేకపోయా...

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్(నమస్తే తెలంగాణ): రాజస్థాన్‌లో తమ పార్టీ అధికారంలో ఉన్నా.. ఒక్క పనీ చేయలేకపోయానని అటవీ శాఖ మంత్రి హేమారామ్ తన బాధ వెళ్లగక్కారు. ఈసారి ఎన్నికల్లో పోటీ చేయట్లేదని ప్రకటించారు. ఓ గ్రామసభలో మాట్లాడుతూ నీటి పారుదల ప్రాజెక్టు టెండర్ల దగ్గరే ఆగిపోయిందన్నారు. తన గుడా మాలానీ నియోజకవర్గంలో ఇంటింటికీ నల్లా కనెక్షన్, నర్మదా ప్రాజెక్టు ద్వారా సాగు నీరు అందిస్తానన్న హామీలు నెరవేర్చలేకపోయానన్నారు.

రాజస్థాన్‌లో కాంగ్రెస్ మొదటి లిస్టు

జైపూర్: రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికలకు కాంగ్రెస్ శనివారం 33 మంది అభ్యర్థులతో మొదటి లిస్టు విడుదల చేసింది. బీజేపీ 83 మంది సభ్యులతో విడుదల చేసిన రెండో జాబితాలో మాజీ సీఎం వసుంధర రాజేకు స్థానం కల్పించింది. కాంగ్రెస్ లిస్టులో ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోట్, మాజీ ఉప ముఖ్యమంత్రి సచిన్ పైలట్‌కు చోటు దక్కింది. వసుంధర రాజే ఝల్రాపటాన్ నుంచే తిరిగి పోటీ చేస్తున్నారు. మహారాజా ప్రతాప్ సింగ్ వారసుడు విశ్వనాథ్ సింగ్ మేవాడ్‌ను నాథ్‌ద్వార నుంచి పోటీలోకి దించారు. తొలుత సీటును నిరాకరించిన ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన నర్పత్ సింగ్‌కు రెండో లిస్టులో స్థానం కల్పించారు.

ఈడీ థర్డ్ డిగ్రీ ప్రయోగించింది : పిళ్లై

న్యూఢిల్లీ : ఢిల్లీ మద్యం పాలసీ కేసు నిందితుడు అరుణ్ రామచంద్రన్ పిళ్లై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) వేధింపులపై సంచలన ఆరోపణలు చేశారు. తనపై ఈడీ అధికారులు థర్డ్ డిగ్రీ ప్రయోగించి, సమాచారాన్ని రాబట్టారని ఆరోపించారు. ఈ కేసులో తనను అరెస్ట్ చేయడాన్ని, రిమాండ్‌లో ఉంచడాన్ని సవాల్ చేస్తూ, ఢిల్లీ హైకోర్టులో ఓ పిటిషన్‌ను దాఖలు చేశారు. దీనిపై వైఖరిని తెలియజేయాలని ఈడీని హైకోర్టు శుక్రవారం ఆదేశించింది. పిళ్లైని ఈడీ అధికారులు మార్చి 6న అరెస్టు చేయడం, ఆయనను ట్రయల్ కోర్టు రిమాండ్‌కు, ఈడీ కస్టడీకి, జ్యుడిషియల్ కస్టడీకి పంపించడం మనీలాండరింగ్ నిరోధక చట్టం నిబంధనలకు విరుద్ధమని ఆయన తరపు న్యాయవాది నితీష్ రాణా వాదించారు. తదుపరి విచారణ నవంబరు 3కు వాయిదా పడగా.. అదే రోజున పిళ్లై బెయిలు దరఖాస్తుపై కూడా విచారణ జరుగుతుంది.

మహువాపై మరిన్ని ఆరోపణలు

న్యూఢిల్లీ: డబ్బులు తీసుకుని లోక్‌సభలో ప్రశ్నలు సంధించారని ఇప్పటికే ఆరోపణలు ఎదుర్కొంటున్న టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రాపై బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే శనివారం తాజాగా మరిన్ని ఆరోపణలు చేశారు. మహువా భారత్‌లో ఉండగా, ఆమె పార్లమెంటరీ ఐడీని మరొకరు దుబాయ్ నుంచి వినియోగించారని, ఈ విషయాన్ని నేషనల్ ఇన్‌ఫర్‌మేటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ) దర్యాప్తు సంస్థలకు వెల్లడించినట్టు చెప్పారు.

ఎంపీలందరి లాగిన్ వివరాలు బహిర్గతం చేయాలి

బీజేపీ ఎంపీ తనపై చేసిన ఆరోపణలపై మహువా తీవ్రంగా స్పందించారు. పార్లమెంట్ ఐడీ ద్వారా లాగిన్ అయిన ఎంపీలందరి వివరాలను ఎన్ఐసీ విడుదల చేయాలని, అలాగే వారంతా ఆయా ప్రదేశాలలో భౌతికంగా ఉన్నారా లేదా అన్నది పరిశీలించాలని ఆమె డిమాండ్ చేశారు. అదానీ గ్రూప్ చేసిన బొగ్గు దిగుమతులకు సంబంధించి వచ్చిన ఆరోపణలపై సీబీఐ విచారణ జరపాలని కోరారు.

కెనడాకు అమెరికా, బ్రిటన్ మద్దతు

న్యూఢిల్లీ, అక్టోబర్ 21: కెనడా, భారత్ మధ్య నెలకొన్న దౌత్య విభేదాలపై కెనడాను అమెరికా, బ్రిటన్ వెనకేసుకు వచ్చి ఆ దేశానికి మద్దతు పలికాయి. నిజ్జర్ హత్యపై దర్యాప్తు సాఫీగా సాగడానికి కెనడాకు భారత్ సహకరించాలని సూచించాయి. ఇటీవల భారత్ నుంచి పలువురు కెనడా దౌత్యవేత్తలను వెనక్కి పంపడంపై యూఎస్ స్టేట్ డిపార్టుమెంట్ ఆందోళన వ్యక్తం చేయగా, ఈ విషయంలో భారత్ తీసుకున్న నిర్ణయాన్ని అంగీకరించబోమంటూ బ్రిటన్ ఫారెన్, కామన్‌వెల్త్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫీస్ (ఎఫ్‌సీడీవో) స్పష్టం చేసింది. విభేదాలను ఇరుదేశాలు పరిష్కరించుకోవాలని సూచించాయి. కాగా, 41 మంది దౌత్యవేత్తలను వెనక్కి పంపేయాలంటూ భారత్ తీసుకున్న ఏకపక్ష నిర్ణయం రెండు దేశాల మధ్య లక్షలాది మంది ప్రజల జీవితాలను కష్టతరం చేసిందని కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో పేర్కొన్నారు.

అజ్ఞానమా.. అహంకారమా!

కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ అక్కసుపై విపక్షాల ధ్వజం

న్యూఢిల్లీ: దేశంలో పేదల ఆకలి కేకలను బయటపెట్టిన గ్లోబల్ హంగర్ ఇండెక్స్ నివేదికపై కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ వ్యాఖ్యలపై ప్రతిపక్షాలు ధ్వజమెత్తాయి. ఏడో 3 వేల మందికి ఫోన్ చేసి 'మీకు ఆకలిగా ఉన్నదా' అని ప్రశ్నించి నివేదిక ఇస్తారంటూ ఆమె చేసిన వ్యాఖ్యలపై ప్రతిపక్ష నేతలు మండిపడ్డారు. ఆమె మాటల్లో దయ లేదని, అజ్ఞానం కనిపిస్తుందని ధ్వజమెత్తారు. 'ఇంత కంటే సిగ్గుచేటు ఏమీ ఉండదు. మీ మాటల్లో మీ అజ్ఞానాన్ని చూపారు' అని కాంగ్రెస్ అధికార ప్రతినిధి సుప్రియా శ్రీనేట్ విమర్శించారు. శివసేన(యూబీటీ) నేత ప్రియాంక చతుర్వేది స్పందిస్తూ 'అహంకారానికి మరో రూపం ఉంటే.. అది స్మృతి ఇరానీనే' అని ధ్వజమెత్తారు. కాగా, ఈ ఏడాది విడుదలైన హంగర్ ఇండెక్స్ నివేదిక ప్రకారం భారత్ 125 దేశాలకుగానూ కేవలం 28.7 స్కోరుతో 111వ స్థానంలో ఉన్నది. బీజేపీ పాలనలో ఈ ర్యాంకు ఏటికేటికి దిగజారుతూ వచ్చింది.

రాజస్థాన్ రెవెన్యూ మంత్రిపై కేసు

జైపూర్: రాజస్థాన్ రెవెన్యూ మంత్రి రామ్‌లాల్ జాట్, మరో నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రానైట్ గనిని అక్రమంగా స్వాధీనం చేసుకోవడమే కాక, అక్కడి నుంచి మెషినరీని అపహరించారన్న ఆరోపణలపై కోర్టు ఆదేశాల కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. గని స్వాధీనంపై పరమేశ్వర్ జోషి అనే వ్యక్తి భిల్వారా జిల్లాలో స్థానిక కోర్టును ఆశ్రయించారు. అయినా పోలీసులు కేసు నమోదు చేయకపోవడంతో ఆయన రాజస్థాన్ హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాలు జారీ చేయడంతో కరేడా పోలీస్ స్టేషన్‌లో మంత్రి రామ్‌లాల్ జాట్, మరో నలుగురిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్టు అసిండ్ డీఎస్పీ యోగేష్ శర్మ తెలిపారు.

నకిలీ కార్డుల ముఠాతో కర్ణాటక మంత్రికి సంబంధాలు!

బెంగళూరు, అక్టోబర్ 21: నకిలీ ఐడీ కార్డులను తయారుచేస్తున్న ముఠా సభ్యుల్ని కర్ణాటక పోలీసులు పట్టుకున్నారు. నకిలీ ఓటర్, ఆధార్, పాన్, డ్రైవింగ్ లైసెన్స్, ఇతర ముఖ్యమైన పత్రాల్ని తయారుచేయటంలో ఆరితేరిన మానేష్ కుమార్, భగత్, రాఘవేంద్రలను అదుపులోకి తీసుకున్నట్టు బెంగళూరు క్రైంబ్రాంచ్ పోలీసులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిందితుల్లో ఒకడైన మానేష్ కుమార్‌కు కర్ణాటక మంత్రి బీఎస్ సురేశాతో సంబంధాలున్నట్టు ఆరోపణలు వెలువడ్డాయి. ముఠాను వెనుకుండి నడిపిస్తున్న మానేష్ కుమార్, రాష్ట్రమంత్రి బీఎస్ సురేశా కలిసి ఉన్న కొన్ని ఫొటోలు పోలీసులకు లభ్యమయ్యాయి.

బెంగళూరులో ఇంతే..!

- **కర్ణాటక రాజధానిలో ట్రాఫిక్ కష్టాలు వర్ణనాతీతం**
- **ఒక వైపు బైక్‌పై వెళ్తూనే యువతి ఆఫీస్ వర్క్**

బెంగళూరు, అక్టోబర్ 21: కాంగ్రెస్ పాలిత కర్ణాటక రాజధాని నగరం బెంగళూరులో ట్రాఫిక్ కష్టాలు రోజువారీ తంతుగా మారింది. ఒక ఉద్యోగి ఉదయం 10 గంటలకు ఆఫీస్‌కు వెళ్లాలంటే, అతను రెండు గంటల ముందుగానే బయలుదేరాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఇక డ్యూటీ ముగించుకొని ఇంటికి వచ్చేది రాత్రి 8 గంటల పైమాటే. దాదాపు తన రోజువారీ జీవితం ట్రాఫిక్, ఆఫీసుల్లో గడిచిపోతున్న పరిస్థితి. పని మీద బయటకు వెళ్లాలంటనే ట్రాఫిక్ బారులను చూసి పౌరులు బెంబేలెత్తిపోతున్నారు. బెంగళూరులో ట్రాఫిక్ కష్టాలను చూపే ఘటనలు, వీడియోలు, చిత్రాలను మనం ఇప్పటికే చాలా చూశాం. తాజాగా ఆఫీస్‌కు వెళ్లేందుకు ఒక యువతి బైక్‌పై వెనుక కూర్చొని వెళ్తూనే ల్యాప్‌టాప్‌లో వర్క్ చేసుకొంటున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. దీన్ని నెటిజన్లు తమ సోషల్ మీడియా ఖాతాల్లో పోస్టు చేస్తూ.. బెంగళూరు ట్రాఫిక్ కష్టాలపై వ్యంగ్య విమర్శలు చేస్తున్నారు. ఒక్క బెంగళూరులోనే ఇలా, బెంగళూరులో ఇది సాధారణమైన విషయమే.. అంటూ పోస్టులు పెడుతున్నారు. ఈ వీడియోకు భారీగా వ్యూస్ వస్తున్నాయి. చాలా మంది వివిధ రకాలుగా కామెంట్లు పెడుతున్నారు. కాగా, ఇటీవల ఇలాగే బైక్‌పై ట్రాఫిక్‌లో చిక్కుకొన్న ఓ మహిళ అక్కడే ల్యాప్‌టాప్‌లో తన పని చేసుకొంటున్న మరో వీడియో కూడా సోషల్ మీడియాలో వైరల్ అయింది.

బెంగళూరు బైక్ వెనకాల కూర్చొని ల్యాప్‌టాప్‌లో పనిచేసుకుంటున్న యువతి

కర్ణాటకలోని గుల్బర్గా విద్యుత్తు కార్యాలయం ఎదుట రైతుల ఆందోళన

గుల్బర్గా విద్యుత్తు కార్యాలయం వద్ద పురుగులమందు తాగి ఆత్మహత్యకు యత్నిస్తున్న ఓ రైతు

కాంగ్రెస్‌తో మొసళ్ల పండగే

- కర్ణాటక అంతటా విద్యుత్తు కోతలు
- కాంగ్రెస్ సర్కారుపై రైతన్న పోరుబాట
- కరెంటు కార్యాలయాల ముందు ధర్నాలు
- గుల్బర్గా కరెంటు ఆఫీసు ముందు అన్నదాత ఆత్మహత్యాయత్నం

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 21 (నమస్తే తెలంగాణ): కన్నడ ప్రజల పరిస్థితి ప్రస్తుతం పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టుగా తయారైంది. బీజేపీ '40 శాతం కమీషన్ రాజ్' పాలనతో విసిగివేసారిన ప్రజలు అధికారాన్ని కాంగ్రెస్‌కు అప్పగిస్తే, విద్యుత్తు కోతలతో కేవలం ఐదు నెలల్లోనే రాష్ట్రమంతటా అంధకారం అలుముకొన్నది. బెంగళూరులో రోజుకు నాలుగైదు గంటలపాటు విద్యుత్తు కోతలు విధిస్తున్నారు. రాష్ట్రంలో వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయి. దీంతో ప్రభుత్వ వైఖరిపై కర్షకలోకం మండిపడుతున్నది. సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతుండటంతో స్పందించిన విద్యుత్తు మంత్రి కేజే జార్జ్.. 'వ్యవసాయానికి నిరంతరాయంగా 5 గంటల పాటు కరెంటు ఇస్తాం' అంటూ ఇటీవల ఆర్భాటంగా ప్రకటించారు. అయితే, దానికీ ప్రభుత్వం కట్టుబడి ఉండట్లేదని, సాగుకు కనీసం 3 గంటలు కూడా విద్యుత్తును సరఫరా చేయట్లేదని అన్నదాతలు వాపోతున్నారు. సర్కారు వైఖరిని నిరసిస్తూ వినూత్న రీతిలో నిరసన ప్రదర్శనలు చేస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సాగుకు తగినంత కరెంటు ఇవ్వాల్సిందేనని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

అందుకే మొసలితో వచ్చాం..

విజయపుర జిల్లా కోల్హారా తాలూకాలోని రోణిహాల్ గ్రామ రైతులు.. హుబ్లీ ఎలక్ట్రిసిటీ సప్లై కంపెనీ లిమిటెడ్ (హెస్కామ్) కార్యాలయానికి ఓ ట్రాక్టర్‌లో మొసలిని తీసుకొచ్చారు. ఐదు గంటల కరెంటు ఇస్తామని చెప్పి..ఒకట్రెండు గంటలే ఇస్తున్నదని, అది కూడా రాత్రిళ్లు సరఫరా అవుతున్నదని అన్నదాతలు మండిపడ్డారు. రాత్రి సమయాల్లో పొలాలకు వెళ్తే, అడవి జంతువులు, మొసళ్లు దాడులు చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తమ ఇబ్బందులు తెలియాలన్న ఉద్దేశంతోనే కరెంటు ఆఫీసుకు మొసలిని తీసుకొచ్చినట్టు రైతులు పేర్కొన్నారు.

పురుగులమందు తాగి..

విద్యుత్తు కోతలను నిరసిస్తూ గుల్బర్గా (కలబురగి) జిల్లాలో రైతులు నిరసన ప్రదర్శనలతో రాస్తారోకోలు నిర్వహించారు. ఎండిన పంటను, పురుగుల మందును చేతబూని గుల్బర్గా విద్యుత్తు కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. కనీసం ఐదు గంటల నిరంతరాయ కరెంటునైనా సరఫరా చేయాలని, లేదంటే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకొంటామని హెచ్చరించారు. హఠాత్తుగా ఓ రైతు పురుగుల మందు తాగగా, అప్రమత్తమైన పోలీసులు సమీప దవాఖానకు తరలించి చికిత్స అందించారు. గుల్బర్గా సహా పలు జిల్లాల్లో రైతులు నిరసనలకు దిగుతున్నారు. శుక్రవారం బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో ఆస్ట్రేలియా, పాకిస్థాన్ మధ్య మ్యాచ్ జరిగింది. ఆట మధ్యలో విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో మ్యాచ్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో అభిమానులు ఒకింత అసహనానికి గురయ్యారు.

సీఎం సిద్ధరామయ్య

గగన్‌యాన్ టెస్ట్ ఫ్లైట్ సక్సెస్

శ్రీహరికోట : గగన్‌యాన్ ప్రాజెక్టులో అత్యంత ముఖ్యమైన టీవీ-డీ1ను ఇస్రో విజయవంతంగా పరీక్షించింది. శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి శనివారం ఉదయం 10 గంటలకు రాకెట్ రోదసిలోకి దూసుకెళ్లింది. దీంతో రోదసిలోకి వ్యోమగాములను పంపించడం కోసం చేస్తున్న కృషిలో ఓ ముందడుగు పడింది. ఈ ప్రయోగం విజయవంతమైన అనంతరం ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్ మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి మాట్లాడుతూ టీవీ-డీ1 శబ్ద వేగానికి సమానంగా ప్రయాణించిందని, ప్రణాళిక ప్రకారమే క్రూ ఎస్కేప్ సిస్టమ్ పని చేసిందని, క్రూ మాడ్యూల్ సురక్షితంగా బంగాళాఖాతంలో దిగిందని తెలిపారు. బంగాళాఖాతంలో పడినవాటిని చెన్నై నౌకాశ్రయానికి తీసుకొచ్చే బాధ్యతను భారతీయ నావికా దళం చేపట్టింది. గగన్‌యాన్ ద్వారా మానవులను 400 కిలోమీటర్ల లో ఎర్త్ ఆర్బిట్‌లోకి పంపించి, మూడు రోజులపాటు సురక్షితంగా ఉంచి, తిరిగి వారిని భూమిపైకి క్షేమంగా తీసుకురావాలని ఇస్రో లక్ష్యంగా పెట్టుకుంది. తొలుత ప్రతికూల వాతావరణం వల్ల ప్రయోగం కాసేపు వాయిదా పడింది. సింగిల్ స్టేజ్ లిక్విడ్ ప్రొపెల్డ్ రాకెట్ ఆకాశంవైపు దూసుకెళ్లడానికి కేవలం 4 సెకండ్లకు ముందు ''హోల్డ్'' అనే సంకేతం స్క్రీన్స్‌పై కనిపించింది. సిస్టమ్‌లో మానిటరింగ్ అనామలీ వల్ల ఇలా జరిగింది. దీనిని ఇస్రో శాస్త్రవేత్తలు చాలా వేగంగా గుర్తించి, సరిదిద్దారు. మిషన్ కంప్యూటర్, గ్రౌండ్ సపోర్ట్ కంప్యూటర్ ప్రయోగానికి పచ్చజెండా ఊపడంతో టీవీ-డీ1 దూసుకెళ్లింది. టీవీ-డీ1 నుంచి క్రూ మాడ్యూల్‌ను క్రూ ఎస్కేప్ సిస్టమ్ దూరంగా తీసుకెళ్లిందని, ఆ తర్వాత క్రూ మాడ్యూల్ కార్యకలాపాలు, క్రూ ఎస్కేప్ సిస్టమ్ వేరుపడటం, పారాచూట్లన్నీ తెరచుకోవడం, తగిన వేగంతో సముద్రంలోకి చేరుకోవడం సజావుగా జరిగినట్లు సోమనాథ్ తెలిపారు.

గుజరాత్‌లో దళిత ప్రిన్సిపాల్ ఆత్మహత్య

రాజ్‌కోట్ : గుజరాత్‌లోని అమ్రేలీ జిల్లా జునా జంజరియా గ్రామంలో దారుణం జరిగింది. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ప్రిన్సిపాల్ కాంతి చౌహాన్ (దళితుడు) శుక్రవారం పాఠశాలలో విషం తాగి, ఆ విషయాన్ని ఆయన తన భార్యకు తెలిపారు. అయితే ఆయన దవాఖానలో చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచారు. అంతకుముందు ఆయన విడుదల చేసిన వీడియోలో తెలిపిన వివరాల ప్రకారం, కాంతి చౌహాన్ ను ఆ గ్రామ సర్పంచ్ ముకేశ్ బోరిసాగర్, పలువురు టీచర్లు తీవ్రంగా వేధించి, కులపరమైన మాటలతో అవమానించినట్లు తెలుస్తోంది.